DHARANI NEWS DAILY

ధరణి న్యూస్

తెలుగు దినపత్రిక

www.dharaninews.com

సంపుటి : 01 సంచిక : 17, శనివారం19-09-2026 పేజీలు : 08 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "ధరణి న్యూస్ " తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన

ఫోన్ నెంబర్ : 9700719535.

దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్.. ఎమ్మెల్యేగా అనర్హత వేటు!



2లో

- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ
- ఏలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా అయినట్లు స్పష్టీకరణ


నీట్ సంస్కరణలపై నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదిక'- సుప్రీంకోర్టుకు చెప్పిన కేంద్రం



ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని గత కమిటీ సభ్యులతోనూ నిలేకని ప్యానెల్ విస్తృతంగా చర్చలు జరిపిందని వెల్లడి

నీట్ పరీక్షలో నిర్మాణాత్మక సంస్కరణలపై సలహాలు ఇచ్చేందుకు నందన్ నిలేకని నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ PS నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని గత కమిటీ సభ్యులతోనూ నిలేకని ప్యానెల్ విస్తృతంగా చర్చలు జరిపిందని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఐఐటీ జాయింట్ సెక్రటరీని ఆదేశించింది. ఈ మేరకు రెండు వారాల్లోగా పురోగతిని తెలియజేస్తూ అఫిడవిట్

మిగతా 2లో



'మాకు మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించండి'

తెలంగాణ రాష్ట్రానికి మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించిన సంగతి తెలిసిందే.

- కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు.
- సీఎం వెంట మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు.
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు సీఎం కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణకు 2 లక్షల పీఎంఏజీ ఇళ్లు

తెలంగాణలోని 11.56 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, 2 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్రమంత్రికి వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీరు, విద్యుత్ కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు.

తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు తెలంగాణలో సన్నబియ్యాన్ని విజయవంతంగా పంపిణీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్‌ను రైతులకు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు.

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం జరుగుతండటంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ముఠా గుట్టురట్టు

లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించిన ముగ్గురు నిందితులు అరెస్ట్

- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన నిందితులు
- వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్న అధికారులు

2లో



2లో

లోకేశ్ ప్రత్యేక చొరవ... ఏపీకి ఐటీ, క్వాంటం కంపెనీల క్యూ.. వేల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

- ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషితో ఏపీకి తరలివస్తున్న టెక్ కంపెనీలు
- రూ.526 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- విశాఖలో డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ భారీ ఆపరేషన్స్ సెంటర్ల ఏర్పాటు
- అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ హబ్.. రూ.2,700 కోట్లతో సృష్టి క్వాంటం సంస్థ
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం

ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు.. జెన్-జీ ఆధ్యాత్మికత వైపు చూస్తోంది: మోహన్ భగవత్



2లో

- ధర్మం పుట్టుక నుంచి మరణం వరకు ఉంటుందన్న భగవత్
- వృద్ధాప్యంలోనే ధర్మం గురించి ఆలోచించడం సరికాదని వ్యాఖ్య
- అహంకారంతో అన్నీ నడిపిస్తున్నామనుకోవడం భ్రమేనని వ్యాఖ్య
- సుఖానికి మూలం ధర్మమేనని స్పష్టం చేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్

ఓటు చోరీ, అధికారం చోరీ, ఇప్పుడు పార్టీ చోరీ'

- ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- టీఎంసీ పార్టీ గుర్తును వాడొద్దని మమతా బెనర్జీ వర్గాన్ని ఆదేశించిన ఈసీ
- తీవ్రంగా ఖండించిన రాహుల్ గాంధీ



2లో


మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్‌కు కేటీఆర్ సవాల్



2లో

- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో గూండాగిరిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



2లో

- 10 నుంచి 20 వాహనాల కాన్వాయ్‌లు క్యాంపస్‌లోకి ఎలా వచ్చాయని ఢిల్లీ హైకోర్టు ప్రశ్న
- ఒక వ్యక్తి తుపాకీ పట్టుకున్న పరిశీలించి తీవ్ర అసహనం
- ఇలాంటి వారిని విద్యార్థులుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్న

నీట్ సంస్కరణలపై నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదిక'- సుప్రీంకోర్టుకు చెప్పిన కేంద్రం

దాఖలు చేయాలని స్పష్టం చేసింది. నీట్ పరీక్ష నిర్వహణ కోసం శాశ్వత సిబ్బందితో కూడిన పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయడమే అత్యంత కీలకమని కోర్టు స్పష్టం చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చీూా కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాన్ని తాము స్వయంగా సందర్శించి వ్యవస్థను
పరిశీలిస్తామని న్యాయమూర్తులు పేర్కొన్నారు. "వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుందో లేదో, సిబ్బంది ఎలా ఉన్నారో చూడటానికి మేమే ఒక రోజు అక్కడికి వస్తాము. మొత్తం వ్యవస్థకు శాశ్వతత్వం ఉండటమే కీలకం అని మీరు తెలుసుకోవాలి. ఒక శాశ్వత స్థలం, శాశ్వత ఏర్పాట్లు ఉండాలి.
కనీసం సగం మంది సిబ్బంది అయినా అక్కడ ఉండాలి. అందరూ డిప్యూటేషన్‌పై వచ్చినవారు కాకూడదు. శాశ్వత సిబ్బంది ఉండాలి. అప్పుడే ఒక శాశ్వత నిర్మాణం ఏర్పడుతుంది. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) కొత్తగా ఆధునీకరించిన కేంద్రాన్ని సందర్శించి, అక్కడి వ్యవస్థను పరిశీలించాలని తాము భావిస్తున్నాం." అని ధర్మాసనం చెప్పింది.
ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) తరపున న్యాయవాది తన్వి దుబే దాఖలు చేసిన పిటిషన్‌తో సహా పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆగస్టు 19న విచారించిన సుప్రీం, ఎన్‌టీఏలో సంస్కరణలను సంస్థాగతం చేయాల్సిన అవసరం ఉందని గమనించింది. ఇందుకోసం రాధాకృష్ణన్ ప్యానెల్, నీలేకని కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి తీసుకున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.
అంతకుముందు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యల్లో భాగంగా పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు కమిటీని ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందులో నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా నియమించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ యస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా ఉన్నారు.

ప్రధాన బాధ్యతలు

NTA పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం
పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం
పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం
పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం
డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం
భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ముఠా గుట్టురట్టు

జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ ఉగ్రవాద ముఠా గట్టురట్టు చేశారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక పిస్టల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రితో పాటు రెండు చైనీస్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఉగ్రవాదులకు సహకరిస్తున్న ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు. తమ దర్యాప్తులో, జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, కోట్ చార్వార్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. వీరు ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, రాజౌరీ-రేసి, పిర్ పంజాల్ ప్రాంతాల గుండా షోపియాన్ వరకు వారు వెళ్లడానికి సహాయపడ్డారని చెప్పారు. అంతేకాదు నిషేధిత ఎల్‌ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్స్ మాడ్యూల్‌లో ఈ ముగ్గురు అనుమానితులు భాగంగా ఉన్నారని పేర్కొన్నారు. వీరిపై రాజౌరీలోని ధర్మసాల్ పోలీసు స్టేషన్‌లో కేసు (ఎఫ్ఐఆర్ నెం.95/2026) నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రస్తుతం తాము సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. "ఉగ్రవాదుల మాడ్యూల్‌పై జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు తెలిపాయి. కోట్ చార్వాల్‌కు చెందిన మహ్మద్ అజమ్, జాకీర్ హుస్సేన్, మహ్మద్ ముస్తాఖ్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్ సపోర్ట్ మాడ్యూల్‌లో భాగమని తేలింది. 2023లో రియాసిలోని చస్సానాలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే అంతకుముందు ఆ ఉగ్రవాదులకు ఈ ముగ్గురు నిందితులు సాయం చేయడం, ఆశ్రయం కల్పించడం, వారి కోరుకున్న చోటుకు వెళ్లేందుకు సహకరం అందించారు" అని పోలీసులు తమ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం..

కాగా, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జీవవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్.. అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు జులై 8న ఓ ఎల్ ఈటీ ఉగ్రవాదిని ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైదెపొరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించి ఆ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి.

ఓటు చోరీ, అధికారం చోరీ, ఇప్పుడు పార్టీ చోరీ'

బంగాల్ ఉపఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని పార్టీ పేరు, గుర్తులను ఉపయోగించవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రజాతీర్పును కాపాడడమే ఎన్నికల సంఘం ప్రధాన విధి అని, కానీ దానికి బదులుగా అది ప్రజల తీర్పును తారుమారు చేసే శక్తులకు సహకరిస్తోందని శుక్రవారం తీవ్ర విమర్శలు చేశారు. "మొదట శివసేన, ఆ తర్వాత ఎన్‌సీపీ, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్. ప్రతిసారీ ఇదే పద్ధతి. పార్టీలను చీల్చడానికి బీజేపీ, ఎన్నికల సంఘం చేతులు కలుపుతాయి. ఆ తర్వాత వాటి ఎన్నికల గుర్తును లాగేసుకుంటాయి. ఒక పార్టీ మొత్తాన్నే దొంగిలించగలిగినప్పుడు, కోట్లాది మంది భారతీయుల ఓట్లను కూడా చోరీ చేయడంలో ఆశ్చర్యం లేదు. ఓటు చోరీ, గవర్నమెంట్ చోరీ, ఇప్పుడు పార్టీ చోరీ- ఇవి మన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నాలుగా మారాయి. అందుకే ఈ పోరాటం కేవలం మమతా బెనర్జీది మాత్రమే కాదు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరు పోరాటం" అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

మోదీకి పుట్టిన రోజు కానుక

బంగాల్ ఉప ఎన్నికల వేళ ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఏఐటీసీ) వర్గాలు తమ పార్టీ గుర్తు వాడకూడదని ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే శుక్రవారం ఉదయంలోగా తమకు నచ్చిన పేర్లు, గుర్తులను సమర్పించాలని కోరింది. దీనిని కాంగ్రెస్ పార్టీ గురువారం తీవ్రంగా ఖండించింది. ఇది రాజ్యాంగ బాధ్యతల నుంచి ఎన్నికల సంఘం తప్పుకోవడమేనని విమర్శించింది. ఏఐటీసీ పేరు, గుర్తును నిలిపివేయడం అనేది ప్రధాని నరేంద్ర మోదీకి సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 'అర్ధరాత్రి ఇచ్చిన పుట్టినరోజు కానుక' అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

ఎవరికీ నష్టం వాటిల్లకుండా ఉండేందుకే!

గురువారం రాత్రి ఈసీ ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపై మమతా బెనర్జీ, అరూప్రాయ్ నేతృత్వంలోని రెండు వర్గాల నాయకుల వాదనలు విన్న తర్వాత 'ఎలక్షన్ సింబల్స్ (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్ 1968' నిబంధనల ప్రకారం, ఈ అంశంపై తగు నిర్ణయం తీసుకుంటామని ఈసీ పేర్కొంది. ప్రస్తుతం ఇరువర్గాలు తమదే అసలైన పార్టీ అని చెప్పుకుంటున్నాయి కాబట్టి, దీనిపై తామ్ను ఓ సమగ్ర నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. అందుకే రెండు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి, వారి హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి, గత సంప్రదాయాలను అనుసరించి ఈ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్లు ఈసీ పేర్కొంది. "అరూప్ రాయ్ (పిటిషనర్) నేతృత్వంలో ని వర్గంగానీ, మమతా బెనర్జీ (ప్రతివాది) నేతృత్వంలోని వర్గం కానీ, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అనే పార్టీ పేరును ఉపయోగించడానికి అనుమతి లేదు. అలాగే ఇంతకు ముందు ఆ పార్టీకి కేటాయించిన పూలు, గడ్డి గర్తును ఉపయోగించడానికి కూడా ఈ రెండు వర్గాలకు అనుమతి ఉండదు" అని కమిషన్ స్పష్టం చేసింది.

తీవ్రంగా ఖండించిన మమత వర్గం

ఈసీ జారీ చేసిన ఈ ఉత్తర్వులను మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొంది. మరోవైపు రితబ్రత, అరూప్ రాయ్‌ల వర్గం ఈసీ నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ- మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీపై విమర్శలు గుప్పించింది. "టీఎంసీకి ప్రజల శాపం తగిలింది. గత 15ఏళ్లుగా బంగాల్ ప్రజలపై వారు సాగించిన హింసకు, వేధింపులకు ఇదే సరైన సమాధానం. వారికి ఇలా జరగాల్సిందే" అని ఆ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి దేబ్‌జిత్ సర్కార్ అన్నారు. బంగాల్ రాష్ట్రంలోని నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ నియోజక వర్గాలకు అక్టోబర్ 6న ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ తీసుకున్న తాజా నిర్ణయం మమత వర్గానికి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

లోకేశ్ ప్రత్యేక చొరవ... ఏపీకి ఐటీ, క్వాంటం కంపెనీల క్యూ.. వేల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, ఫ్యూచర్ టెక్నాలజీ కంపెనీలు భారీ ఎత్తున తరలివస్తున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఈ భేటీలో రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 8,896 ఉద్యోగాలు కల్పించే 10 కీలక ఐటీ ప్రాజెక్టులకు, అలాగే క్వాంటం టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించగల పలు ప్రాజెక్టులకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో విశాఖపట్నం మరోసారి ఐటీ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. తాజాగా జరిగిన ఎస్ఐపీబీ భేటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డెలాయిట్, విశాఖలో రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది. అదేవిధంగా, ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో వైజాగ్‌లో "ఇంటిగ్రేటెడ్ హబ్ ఏఐ ఓ టెక్ ట్రైనింగ్ సెంటర్"ను నెలకొల్పనుంది. ఈ కేంద్రం ద్వారా 2,400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు, రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ఇందులో భాగంగా సృష్టి క్వాంటం ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటం కంప్యూటింగ్ హార్డ్‌వేర్, నానోఫ్యాబ్రికేషన్ తయారీ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే దాదాపు 3,000 ఉద్యోగాలు రానున్నాయి. వీటితో పాటు క్వాంటం కోడాన్, అరోహాక్ టెక్నాలజీస్, ట్రిక్వాంటా లాబ్స్, ఫోటాన్‌కోర్ సిస్టమ్స్, వెరిడేటా హెల్త్ వంటి సంస్థలు కూడా అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ కంపెనీల రాకతో క్వాంటం ఏఐ, డ్రగ్ డిస్కవరీ, ఫోటోనిక్స్ క్వాంటం రీసెర్చ్ వంటి అత్యాధునిక రంగాల్లో రాష్ట్ర యువతకు ఉజ్వల అవకాశాలు లభించనున్నాయి.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు ప్రోత్సాహకాల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తాజా నిర్ణయాలతో విశాఖపట్నం, అమరావతి, కడప వంటి ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. లోకేశ్ నాయకత్వంలో ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్.. ఎమ్మెల్యేగా అనర్హత వేటు!

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ 2026 మార్చి 11న పిటిషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు.
స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది.దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు.. జెన్-జీ ఆధ్యాత్మికత వైపు చూస్తోంది: మోహన్ భగవత్

ధర్మం అనేది కేవలం వృద్ధాప్యానికి పరిమితమైన అంశం కాదని, మనిషి పుట్టినప్పటి నుంచి చివరి వరకు అది మార్గనిర్దేశం చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భగవద్గీత, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలను కేవలం పదవీ విరమణ తర్వాత చదవాలని చాలామంది భావిస్తారని, అయితే ఆ అభిప్రాయం ఏమాత్రం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. జీవితంలోని ప్రతి అడుగు ధర్మానుసారమే సాగాలని సూచించారు. నేటి తరం యువత (జెన్-జీ) ధర్మం, ఆధ్యాత్మిక అంశాలు, భజనల పట్ల ఆసక్తి కనబరచడం సంతోషకరమని భగవత్ అన్నారు. "అన్నీ నేనే చేస్తున్నాను" అనే అహంకారం కేవలం భ్రమకే దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ధర్మాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనసులో ఉన్న పాత అపోహలను, ముందస్తు అభిప్రాయాలను పక్కన పెట్టాలని కోరారు. తన ఆలోచనలను ఇతరులపై రుద్దడం తన ఉద్దేశం కాదని, ఈ జ్ఞానం సృష్టి ఆరంభం నుంచే ఉందని ఆయన వివరించారు. సృష్టి ఆది నుంచి అంతం వరకు ధర్మమే శాశ్వతమని, వ్యక్తిగత జీవితంలో పుట్టుక నుంచి మరణం వరకు సర్వ సుఖాలకు ధర్మమే మూలమని మోహన్ భగవత్ పునరుద్ఘాటించారు.

ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో గూండాగిరిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల ప్రచారంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, నిబంధనల ఉల్లంఘనలపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల అక్రమాలు, గూండాగిరి తీరుపై మండిపడుతూ 'మీ పద్ధతి ఇంకా మార్చుకోలేదు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించడమే కాకుండా, ఫలితాల అనంతరం క్యాంపస్ పరిధిలోనూ, హాస్టళ్లలోనూ ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని నిషేధం విధించింది. విచారణ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేని 10 నుంచి 20 వాహనాల కాన్వాయ్‌లు క్యాంపస్‌లోకి ఎలా వచ్చాయని, వాహనాల పైకప్పులపై నిలబడి ప్రచారం చేయడంపై న్యాయస్థానం అధికారులను నిలదీసింది. అభ్యర్థులలో భయాందోళనలు రేకెత్తించేలా ఉన్న కాన్వాయ్ ఫొటోలను, అలాగే ఒక వ్యక్తి తుపాకీ పట్టుకుని ఉన్న దృశ్యాలను పరిశీలించి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అలాంటి వారిని అసలైన విద్యార్థులుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దని ఢిల్లీ పోలీసులకు స్పష్టం చేసింది. ఈ ఉల్లంఘనలపై బాధ్యులైన విద్యార్థి సంఘాలు, అభ్యర్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్ కు కేటీఆర్ సవాల్

ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు.
కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. దేశంలో అధికంగా పెరుగుతున్న డెంగ్యూ, విష జ్వరాల కేసులు..

వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న అనూహ్య మార్పులు భారత్‌లో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతోపాటు వేడి సంబంధిత అనారోగ్యాల ముప్పును కూడా పెంచుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో సాధారణానికి భిన్నమైన ఉష్ణోగ్రతలు, ఎక్కువ కాలం కొనసాగే పొడి వాతావరణం, అకస్మాత్తుగా కురిసే భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో వర్షాకాల వ్యాధులు, తీవ్రమైన వేడి కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు ఒకేసారి పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే ఢిల్లీలో ఆగస్టు నెలలో 90 కొత్త డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ సీజన్‌లో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 311కి చేరింది. అదే సమయంలో మలేరియా కేసులు జూలైలో 17 నుంచి ఆగస్టులో 53కి పెరిగాయి.

వాతావరణ మార్పులే కారణం..

ఎల్ నినో కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులు దోమల వృద్ధి, వ్యాధుల వ్యాప్తిపై ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏడిస్ ఈజిప్టై దోమలో డెంగ్యూ వైరస్ అభివృద్ధి చెందే వేగం పెరుగుతుంది. మరోవైపు అసమాన వర్షపాతం కారణంగా ఇళ్లలోని నీటి నిల్వలు, కూలర్ల ట్రేలు, పూల కుండీల కింద ఉండే పాత్రలు, నిర్మాణ ప్రాంతాలు, కాలువల్లో నీరు నిలిచిపోతుంది. ఇవి దోమల పెరుగుదలకు అనుకూల ప్రాంతాలుగా మారుతాయి. అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం కలిసినప్పుడు వడదెబ్బ, శరీరంలో నీరు తగ్గిపోవడం, తీవ్రమైన వేడి కారణంగా ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

ఈ లక్షణాలు కనిపిస్తే..

వేడి కారణంగా వచ్చే అనారోగ్యాలు, డెంగ్యూ లక్షణాలు కొన్ని సందర్భాల్లో ఒకేలా కనిపిస్తాయి. తీవ్రమైన వేడి వల్ల అలసట, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం, కండరాల్లో తీవ్రమైన నొప్పులు, గందరగోళం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూ విషయంలో అధిక జ్వరం, కళ్ల వెనుక తీవ్రమైన నొప్పి, కీళ్లు, కండరాల్లో నొప్పులు, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా వికారం, రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం వంటి



లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.

జాగ్రత్తలు తప్పనిసరి..

డెంగ్యూ, వేడి సంబంధిత అనారోగ్యాల నుంచి రక్షణ పొందేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వారానికి కనీసం ఒకసారి నీటి నిల్వ పాత్రలు, కూలర్ల ట్రేలు, పూల కుండీల కింద ఉండే పాత్రలను ఖాళీ చేసి శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. దోమల నివారణకు తగిన దోమల వికర్షకాలను ఉపయోగించడం, కిటికీలు, తలుపులకు మెష్ ఏర్పాటు చేసుకోవడం, పూర్తిగా శరీరాన్ని కప్పే పలుచని దుస్తులు ధరించడం ఉపయోగకరంగా ఉంటుంది. వేడి ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయంలో బయట శారీరక శ్రమను తగ్గించి, తగినంత నీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీరు లేదా ఎలక్ట్రోలైట్ ద్రవాలు తీసుకోవాలి. అలాగే బహిరంగ కాలువలు, నీరు పొంగిపొర్లే ట్యాంకులు, పేరుకుపోయిన చెత్త వంటి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చు.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పై..విస్తృత చర్చ



మెదక్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 18-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం ఆర్డీఓ రమాదేవి అధ్యక్షతన మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించబడింది.ఈ సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (꠰×=) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ప్రక్రియలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా, తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్లు మరియు మ్యాపింగ్ చేయని ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై నిర్వహించే విచారణ (ఎఋతీఱఅస్త్ర ్రాతీశిఎవం) విధానాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. విచారణ సందర్భంగా సమర్పించిన ఆధారాలను పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, ఓటరు దరఖాస్తుల పరిశీలన, ప్రాసెసింగ్ విధానంపై కూడా సమావేశంలో చర్చించారు. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదుకు సమర్పించే ప్రతి దరఖాస్తుకు డిక్లరేషన్ (ణవఎశ్రీఖతీఖ్ఱఅశీఅ) తప్పనిసరిగా జతచేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. 34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం అందించాలని ఆర్డీఓ శ్రీమతి రమాదేవి కోరారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీ లక్ష్మణ్ బాబుతో పాటు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

. రాష్ట్ర ప్రభుత్వం మా గూడెం నికి కరెంటు ఇచ్చి మా ప్రాణాలు కాపాడాలని చినారుట్ల చెంచు గిరిజన గూడెంలో ఇవ్వాలని ఆందోళన చెంచు గిరిజన మహిళలు.



ప్రకాశం ధరణి న్యూస్, సెప్టెంబర్ 18-దోర్నాల మండలం చింతల గ్రామపంచాయతీ పరిధిలో శ్రీశైలం హైవే రోడ్డు పక్కన చిన్నారుల చెంచు చెంచు గిరిజన గూడెంలో దాదాపు 120 కుటుంబాలు గత 75 అక్కడ చెంచులు నివాసం ఉంటున్నాడు. అయితే వారికి కరెంటు లేకపోవడంతో చెంచు గిరిజనులు అడవిలో ఉండటం వలన మన్య మృగాల మధ్యన భయపెడుతూ బ్రతుకుతున్నారు చిరుత పులి గతంలో ఒక చిన్నారిపై దాడి చేసింది స్థానికంగా చర్చి గిరిజనులు గ్రామం మొత్తం వచ్చి శ్రీశైలం రోడ్డు పై బైఠాయించారు అయితే స్పందించిన అప్పట్లో ఫారిసిడిఎఫ్ఓ రేంజర్లు చెంచుల సమస్యలను అడగగా కరెంటు లేకపోవడం వలన మా చిన్నారిపై వందే మృగాల దాడులు జరుగుతున్నాయని ఈ అడవి తల్లిని నమ్ముకుని మేము ఇక్కడే మా పూర్వికులు నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాను. ఎన్ని ప్రభుత్వాలు మారిన మేము తాగడానికి నీళ్లు కరెంటు కోసం ఇబ్బందులు పడుతున్నామని మా సమస్యలు పరిష్కరించాలని వాదిస్తున్న అడవి శాఖ అధికారులు కూడా స్పందించిన వారు మీరు కరెంటు లాక్కుండెందుకు పై అధికారులతో మాట్లాడి అనుపుతిస్తామని చెప్పారు కానీ ఇప్పటికి సంవత్సరం అవుతున్న ఇంతవరకు మాకు కరెంటు రాలేదని. అయితే మా విషయాలని విద్యుత్ శాఖ మంత్రి జిల్లా కలెక్టర్ శ్రీశైలం ఐ టి డి. పి ఓ కి మా కరెంటు సమస్యలు తీసుకెళ్లామని స్పందించిన వారు త్వరలో మీకు కరెంటు ఇస్తామని చెప్తున్నారు కానీ ఇంతవరకు ఇవ్వలేదని చెంచు గిరిజనులు కొమురం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పై ఆశీర్వాదానికి తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి చినారుట్ల చెంచి గిరిజన గూడెం కరెంటు సరఫరా చేసేందుకు ఏపీ డి సి ఎల్ వారికి అనుమతులు ఇవ్వాలని చెంచు గిరిజనుల తరపున జిల్లా కలెక్టర్ గారిని శ్రీశైలం ఐటీడీఏ పిఓ ను సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడమైనది. ఈ కార్యక్రమంలో టీటీడీఏ చెవుల గురవయ్య కుడుముల వెంకటేశం గంగన్న భ్రరాంబ వీరయ్య చెంచు గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు

నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆశీర్వాద దీపం



సిద్దిపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 18--ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలోని వీఎల్ఆర్ ఫార్చూన్ కమ్యూనిటీలో ఆశీర్వాద దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ సభ్యులు 108 దీపాలను వెలిగించి మోదీ ఆయురారోగ్యాలతో, శక్తిసామర్థ్యాలతో దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వీఎల్ఆర్ కమ్యూనిటీ అధ్యక్షుడు చిట్టి సుధాకర్‌రెడ్డి, ప్రతినిధులు పల్లె వంశీకృష్ణగౌడ్, శాస్త్రుల కిరణ్మయి, చిట్టి సువర్ణాదేవి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ సుమారు 25 ఏళ్లుగా ప్రజా జీవితంలో కొనసాగుతూ దేశ సేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు, నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయని అన్నారు.స్వచ్ఛభారత్, డిజిటల్ లావాదేవీలు, అంతరిక్షం, అణుశక్తి తదితర రంగాల్లో భారత్ పురోగతి సాధించిందని వారు పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2047 నాటికి భారత్‌ను మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దిశగా దేశం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మోదీ జన్మదినం సందర్భంగా 108 దీపాలను ఆశీర్వాద దీపాలుగా వెలిగించి, ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండి దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్. దయాకర్, విజయ్‌కుమార్, కృష్ణారావు, ఉమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ కార్యాలయ గణనాధుని శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి

భక్తి భావం ఉప్పొంగేలా పూజా కార్యక్రమాలు నిర్వహణ

9.9అదనపు కలెక్టర్ నగేష్ కలెక్టరేట్ ఉద్యోగులకు, సిబ్బందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ప్రతి మా సింగ్





మెదక్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 18- జిల్లా సమీకృతకలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించి బొజ్జ గణపయ్యకు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ (ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణనాథుడికి పుష్పాలు సమర్పించి, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో సాగాలని ఆకాంక్షించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం .. గణనాథుడి నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్నదాన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ విజయలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారిని సింధు, కలెక్టరేట్ కార్యాలయ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రముఖ యువ ట్రైనర్ మోటివేషన్ స్పీకర్ వై సురేంద్ర





ధరణి న్యూస్, సెప్టెంబర్ 18-జూలూరుపాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఏ. రేవంత్ రెడ్డి ని హైదరాబాద్ అసెంబ్లీ లో ప్రముఖ మోటివేషనల్ ట్రైనర్ మరియు యూత్ లీడర్, మోటివేషన్ స్పీకర్ వై సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తాను రాష్ట్ర వ్యాప్తంగా యువతకు అందిస్తున్న మోటివేషనల్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్ మరియు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల గురించి సీఎం కి వివరించారు.తన సేవలను, యువతలో నింపుతున్న స్ఫూర్తిని చూసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగాఅభినందించారు. “ఇలాంటి ట్రైనింగ్స్ ఇప్పుడున్న యువతకు చాలా అవసరం, మీరు చేస్తున్న కృషి అభినందనీయం” అని కొనియాడారు. ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం మీడియా ముఖం గ ట్రైనర్ సురేంద్ర మాట్లాడుతూ “సీఎం నా ట్రైనింగ్ ని మెచ్చుకోవడం నా జీవితంలో మరువలేని క్షణం. ఇది నాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది” అని ఆనందం వ్యక్తం చేశారు.అదే విధం గా ముఖ్య మంత్రి నీ కలవడానికి కారణమైన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రఘుమయీ దయానంద్ కి మరియు ఇన్ఫ్లూర్ అండ్ ఇగ్నైట్ డైరెక్టర్ రంజిత్ అన్నకి, రాము అన్నకి, సుధాకర్ అన్నకి మరియు తనని ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

కుంకుమార్చనలో భక్తి సందడి

లక్కీ డ్రాలో తులం వెండి సొంతం చేసుకున్న మహిళ





రామాయంపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 18--రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలకు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన కుంకుమార్చనతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం కుంకుమార్చనలో పాల్గొన్న 24 మంది మహిళలతో తులం వెండి బహుమతి కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో ప్రేమలత రామస్వామి విజేతగా నిలిచారు. నిర్వాహకులు ఆమెకు తులం వెండి బహుమతిని అందజేశారు. బహుమతి దక్కడంపై ప్రేమలత సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుంకుమార్చన, అన్నప్రసాద కార్యక్రమాలకు కాలనీవాసులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రావు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదాన కార్యక్రమం



ధరణి న్యూస్, సెప్టెంబర్ 18- అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డి సి పి ఎగ్గడి భాస్కర్, ఆర్ డి ఓ శ్రీనివాసరావు అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, డైరెక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

రవీంద్ర భారతిలో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు

- వెదురు వృత్తికి పూర్వవైభవం తెస్తాం

- ఉప్పల్ భాగాయత్‌లో భవనానికి ఈ నెలలోనే నిధులు

- మేదరి/మహేంద్ర కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ





హైదరాబాద్,ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, బీసీ కార్పొరేషన్ నేతృత్వంలో తొలిసారిగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా మేదరి సమాజ జీవనోపాధికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ‘వెదురు బొంగుల పండుగ – ప్రపంచ వెదురు దినోత్సవం’ను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేదరి కళాకారులు రూపొందించిన వివిధ రకాల వెదురు హస్తకళా వస్తువులను మంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ‘మేదరి జీవన విధానం’ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సంప్రదాయ వెదురు వృత్తిని ఆధునిక నైపుణ్యాలతో అనుసంధానం చేసి మేదరి సమాజానికి మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వక్తలు వివరించారు. అలాగే వెదురును గడ్డి జాతి మొక్కగా గుర్తించి నిబంధనలను సడలించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంఘం నాయకులు పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి మేదరి వృత్తిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అంతే కాకుండా 500 కోట్లతో బీసీ కార్పొరేషన్ ను ఏర్పాటు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడంతో సంప్రదాయ వెదురు వస్తువులకు మార్కెట్ తగ్గిపోయిందని మేదరి సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెదురు ముడిసరుకు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో వృత్తిని నమ్ముకున్న కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా లేదా సబ్సిడీపై వెదురు అందించాలని కోరారు.

మేదరి/మహేంద్ర కార్పొరేషన్ ఏర్పాటు అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. సంఘం సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం అందిస్తే త్వరలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిదంగా ఉప్పల్ భాగాయత్‌లో మేదరి సంఘం పేరిట ఉన్న స్థలంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఈ నెలలోనే నిధులు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. వెదురు ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు అవసరమైన చోట స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెదురు వృత్తికి ఆధునిక మార్కెట్ అవసరం అని అన్నారు. వెదురు పర్యావరణహితమైన ముడిసరుకుగా ఉండటంతో ఆధునిక డిజైన్లతో ఫర్నిచర్, గృహోపకరణాలు, హస్తకళా వస్తువులకు విస్తృత మార్కెట్ అవకాశాలు ఉన్నాయి. అందుకు ప్రభుత్వం నుండి అన్ని సహాయసహకారాలు అందిస్తుందని అన్నారు.

వెదురు వస్తువుల ప్రదర్శన, విక్రయాలకు అవసరమైన చోట స్థలాలు కేటాయించేలా చూస్తామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మేదరి వృత్తిదారులు ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధితోనే ఆర్థిక, సామాజికంగా ముందుకు సాగగలమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తుల్లోనూ మార్పులు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. యువత ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు వస్తుందని పేర్కొన్నారు. మేదరి వర్గాలు ఆర్థికంగా ఎదగాలంటే సంఘంలోని నాయకులు, ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తులు ఐక్యంగా పనిచేయాలని మంత్రి సూచించారు. బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, మేదరి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, ఉమ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటూ ముకుందం, పులి రాజేందర్ సంఘం నాయకులు తదితరులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మేదరి సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలు - పోలీసుల నడుమ నమ్మకమైన ‘సేతు’

- మెహదీపట్నం పీఎస్ లో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ ఏఐ (AI) కియోస్క్ ‘సేతు’ ప్రారంభం

- సామాన్యుడికి సాంకేతిక భరోసా.. ఏ భాషలోనైనా ఫిర్యాదు చేసే వెసులుబాటు

- డిజిటల్ ట్రాకింగ్‌తో పెరగనున్న జవాబుదారీతనం: నగర సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్





హైదరాబాద్, ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– బాధను చెప్పుకోవడానికి పోలీస్ స్టేషన్ మెట్లెక్కే సామాన్యుడికి ఎలాంటి బెరుకు, ఆందోళన కలగకూడదనే ఉద్దేశంతో హైదరాబాద్ నగర పోలీసు విభాగం వినూత్న సాంకేతిక సేవలకు శ్రీకారం చుట్టింది. కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కియోస్క్ ‘సేతు’ ను శుక్రవారం మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఐపీఎస్ ప్రారంభించారు. ఠాణా రిసెప్షన్ వద్దే బాధితుల సమస్యలను తక్షణమే గుర్తించి, సత్వర పరిష్కారానికి మార్గదర్శనం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.– సొంత భాషలోనే ఫిర్యాదు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే పౌరులు భాషా సమస్యలతో ఇబ్బంది పడకుండా, తమకు అలవాటైన భాషలోనే సమస్యను నిరభ్యంతరంగా వివరించవచ్చు. కృత్రిమ మేధ సాయంతో ఈ కియోస్క్ బాధితుడి మాటలను డిజిటల్‌గా నమోదు చేస్తుంది.– తక్షణ ప్రాధాన్యం -- స్పష్టమైన మార్గదర్శనం: రిసెప్షన్ వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, ఫిర్యాదు అందిన వెంటనే డిజిటల్ రసీదును అందజేస్తూ.. తదుపరి ప్రక్రియ ఏమిటన్నది బాధితుడికి స్పష్టంగా వివరిస్తుంది. “మా బాధను ఎవరూ వినలేదు” అనే భావన ఏ ఒక్కరికీ కలగకుండా ఈ వ్యవస్థ భరోసానిస్తుంది.– పారదర్శకత -- నిరంతర పర్యవేక్షణ: నమోదైన ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక డిజిటల్ ట్రాకింగ్ సదుపాయం ఉంటుంది. సమస్య పరిష్కారమయ్యేంతవరకు దర్యాప్తు ఏ దశలో ఉందో, తీసుకున్న చర్యలేమిటో ఉన్నతాధికారులు సైతం సులువుగా సమీక్షించవచ్చు.– సిబ్బందికి సమయ ఆదా: ఫిర్యాదుల ప్రక్రియ వేగవంతం కావడం వల్ల ఠాణా సిబ్బందికి విలువైన సమయం ఆదా అవుతుంది. తద్వారా వారు నేర నియంత్రణ, దర్యాప్తుపై మరింత ఏకాగ్రతతో దృష్టి సారించే వెసులుబాటు కలుగుతుంది.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. “పోలీసింగ్ వ్యవస్థకు ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం. బాధతో స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో, గౌరవప్రదంగా పలకరించి, పూర్తి సంతృప్తితో వెనక్కి పంపాలన్నదే మా విధానం. పోలీస్ స్టేషన్‌లో అడుగుపెట్టే తొలి కేంద్రమైన రిసెప్షన్ కౌంటర్ నుంచే పౌరులకు ఆ నమ్మకం కలగాలి. ‘సేతు’ అంటే వారధి.. ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మధ్య మరింత విశ్వసనీయతను పెంచే వారధిగా ఇది నిలుస్తుంది. సాంకేతికతను జోడించి పౌర సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసేందుకు ఈ వినూత్న ప్రయోగం చేపట్టాం.” అని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించిన ‘సేతు’ కియోస్క్ సేవలను.. ఫలితాల ఆధారంగా దశలవారీగా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకూ విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు. నగర ప్రజలు ఈ ఆధునిక సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ విలువైన సలహాలు, సూచనలను అందించి పోలీసింగ్ వ్యవస్థను మరింత ప్రజాహితంగా మార్చేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (శాంతి భద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, ఐ.పి.ఎస్., అవినాష్ కుమార్, ఐ.పి.ఎస్., ఎస్.ఎం.ఐ.టి., గోల్కొండ జోన్ డి.సి.పి. జె. రాఘవేందర్ రెడ్డి, డెవలపర్ అమిత్ సింగ్ , అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్ , ఎసిపి- శ్రీనివాస్, ఎస్ .హెచ్.ఓ మల్లేశ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానంలోని ప్రతి శుక్రవారం అంకాళమ్మ వారికి విశేష పూజలులి



నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.

కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.

ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది.

చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకృతురాలైనా కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.

కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.

అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

శ్రీశైలం దేవస్థానం లోని ఊయలసేవ



నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– లోకకల్యాణం కోసం దేవస్థానం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది.

ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది.

ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.

అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది.

ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి..

పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు సుండి పెంట గ్రామంలో వినాయకుని విగ్రహాలు నిమజ్జనం వైభవంగా జరిగినది



నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– సుండి పెంట గ్రామంలోని శ్రమరాంబ థియేటర్ సమీపము నందు ఫోటో లామినేషన్ చేస్తున్న శివ వినాయకుని విగ్రహాన్ని ఐదవ రోజు నిమజ్జల కార్యక్రమం 10 కేజీల లడ్డు పాట 25 వేల ఒక వందకు వేలంపాటలో మిద్దె రవికుమార్ (జూతీవంం)కుమారుడు మిద్దె సాయికుమార్ లడ్డును వేలం పాటలో పాడుకున్నారు ఈ కార్యక్రమంలో దాము సాయి చికెన్ షాప్ శివ రాజు కార్తీకు మణికంఠ కిషోర్ కొలిమి సాయి సంఘం పాలు మల్లీ ఎస్బిఐ బ్యాంక్ నాగరాజు శివకుమార్ వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు

రామక్కపేటలో వినాయకుడికి ప్రత్యేక పూజలు



ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– :-దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట గ్రామంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భారతరత్న యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ డాక్టర్ కొండా విటోభ హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డప్పు రాజు, సిద్దుల కుమార్, బాబు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

కొబ్బరికాయలో కొలువుదీరిన గణపయ్య

భక్తికి సృజనాత్మకతను జోడించిన రామకోటి రామరాజు

భగవంతుని సమర్పించే ప్రతి వస్తువులోనూ భగవంతుడే

సిద్దిపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– భక్తికి కళాసృజనాత్మకతను జోడిస్తూ, భగవంతునికి పవిత్రంగా సమర్పించే కొబ్బరికాయపై గణపతి రూపాన్ని అద్భుతంగా చిత్రించి శుక్రవారం నాడు ఆవిష్కరించి భక్తిని చాటుకున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. వినాయక నవరాత్రుల సందర్భంగా గణపతిపై తనకున్న భక్తిభావాన్ని వినూత్న ఆలోచనతో కళారూపంగా ఆవిష్కరించినట్లు రామకోటి రామరాజు తెలిపారు. భగవంతునికి సమర్పించే ప్రతి వస్తువులోనూ దైవత్వాన్ని దర్శించాలనే సందేశాన్ని ఈ కళారూపం చాటుతోంది. భక్తిని కేవలం పూజా విధానానికే పరిమితం చేయకుండా, గత 30 ఏళ్ల నుండి కళ ద్వారా కూడా దైవభావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో రామకోటి





రామరాజు చేస్తున్న వినూత్న ప్రయత్నం. నైపుణ్యంతో చిత్రించడం పట్ల భక్తులు, స్థానికులు రామకోటి రామరాజును అభినందించారు.

త్రిశివ్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నిజాంపేట్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 18– నిజాంపేట సర్కిల్ బండారి లేఅవుట్ రోడ్ నెంబర్ 6 ఏ లో త్రిశివ్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

వినాయక చవితి నవరాత్రులలో భాగంగా శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దమనుషులు ప్రజలు మహిళలు విజ్ఞేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాలను స్వీకరించారు ,ఈ కార్యక్రమంలో కొలన్ లక్ష్మారెడ్డి
కొలన్ శ్యామ్ రెడ్డి
కొలన్ జ్ఞానేశ్వర్ రెడ్డి
బొర్రా వంశీధర్ రెడ్డి
దినేష్ బేగరి
టేకుల ప్రశాంత్ రెడ్డి
కొలన్ విష్ణువర్ధన్ రెడ్డి
కొలన్ అరవింద్ రెడ్డి
కొలన్ జశ్వంత్ రెడ్డి
చిర వినయ్ సాయి రెడ్డి
టేకుల చైతన్యరెడ్డి
టేకుల శశాంక్ రెడ్డి
టేకుల కౌశిక్ రెడ్డి
కొలన్ సందీప్ రెడ్డి
లక్ష్మీదీప్ చౌదరి
తరుణ్ వర్మ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో వెస్ట్‌జోన్

ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపికలు

కూకట్ పల్లి, ధ్రరణి న్యూస్, సెప్టెంబర్ 18– జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాయి వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. జయలక్ష్మి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ ఆర్. సైదా, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సెల్ స్టాటిస్టికల్ ఇన్‌చార్జ్ నర్సింహులు గౌడ్, జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ కోసం నిర్వహించిన ఎంపికల్లో భాగంగా ప్రతిభావంతులైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు పలు దశల్లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎత్తు కొలత, 1.5 కిలోమీటర్ల పరుగును 10 నిమిషాల్లో పూర్తి చేయడం, పరేడ్/డ్రిల్, ప్రత్యేక ప్రతిభ ప్రదర్శనలు వంటి అంశాలను పరిశీలించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహం, క్రమశిక్షణ, సేవా స్ఫూర్తితో ఎంపికల్లో పాల్గొన్నారు. వారి శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా భావం, ప్రత్యేక ప్రతిభ ఆధారంగా వివిధ దశల్లో ప్రతిభను అంచనా వేశారు.
ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. యువతలో సేవా భావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర





పోషిస్తుందని అన్నారు. ఇలాంటి ఎంపిక కార్యక్రమాలు విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడంతో పాటు ఉన్నత స్థాయిలో తమ విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, పాటిల్, సునీత తదితరులతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇరాన్‌పై ఆంక్షల కొనసాగింపునకు అగ్రరాజ్యం ప్లాన్- అమెరికాకు షాకిచ్చిన రష్యా, చైనా- తీర్మానంపై వీటో చేసిన ఇరు దేశాలు

పశ్చిమాసియా యుద్ధం వేళ అమెరికాకు రష్యా, చైనాలు షాక్ ఇచ్చాయి. యూఎస్ శత్రు దేశం ఇరాన్‌కు అండగా నిలిచాయి. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీ గడువును మరో ఏడాది పాటు పొడిగించాలనే అమెరికా ప్రతిపాదనను రష్యా, చైనాలు వీటో చేశాయి. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలుగా వీటో అధికారాలు ఉన్న ఈ రెండు దేశాలు గురువారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా తీర్మానాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. యూఎన్‌లో అమెరికా తీర్మానంపై ఓటింగ్ జరగ్గా, ఈ ప్రతిపాదన 11-2 ఓట్ల తేడాతో ఓడిపోయింది. కాగా, రష్యా, చైనాల వీటో అధికారాన్ని వాడుకోగా, సోమాలియా, పాకిస్థాన్‌లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత ఆర్నెల్లుగా ఇరాన్‌తో భీకరంగా యుద్ధం నేపథ్యంలో టెహ్రాన్‌ను ఆర్థికంగా ఏకాకిగా చేసేందుకు అగ్రరాజ్యం అమెరికా విస్తృతంగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ, యూకేల మధ్య 2015లో కుదిరిన అణు ఒప్పందం నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని యూరప్ దేశాలు ఆరోపించాయి. ఈ క్రమంలో ఐరాస కీలక నిర్ణయం తీసుకుంది. 2025 సెప్టెంబరులో స్నాప్‌బ్యాక్ మెకానిజం కింద ఇరాన్‌పై చర్యలు తీసుకుంది. ఇరాన్‌పై ఆంక్షల అమలును పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీకి అధికారం కల్పించింది. కాగా, ఇరాన్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆంక్షలు ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. ఇరాన్ విదేశీ ఆస్తులను స్తంభింపజేయడం, టెహ్రాన్‌తో ఆయుధ ఒప్పందాలను నిలిపివేయడం, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమ అభివృద్ధిని నిరోధించడం వంటి ఇతర చర్యలు ఈ ఆంక్షల్లో ఉన్నాయి.

చైనా, రష్యాకు థ్యాంక్స్ చెప్పిన ఇరాన్
తమ దేశానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానాన్ని వీటో చేసినందుకు చైనా, రష్యాలకు ఇరాన్ మిషన్ కృతజ్ఞతలు తెలిపింది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఐరాస భద్రతా మండలిని దుర్వినియోగం చేయడానికి అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న మరో నీచ ప్రయత్నాన్ని ఈ దేశాలు అడ్డుకున్నాయని పేర్కొంది. ఐరాస భద్రతా మండలిలో అమెరికా తీర్మానికి వ్యతిరేకంగా చైనా, రష్యాలు వీటో చేయడంపై హర్షం వ్యక్తం చేసింది.

ఇరుదేశాలపై అమెరికా ఆగ్రహం
మరోవైపు, తమ తీర్మానికి వ్యతిరేకంగా రష్యా, చైనాలు వీటో చేయడంపై ఐక్యరాజ్యసమితిలో అమెరికా డిప్యూటీ అంబాసిడర్ జెన్నిఫర్ లోసెట్టా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీటోల పట్ల అమెరికా ఆశ్చర్యపోలేదని చెప్పారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలపై నిపుణుల పర్యవేక్షణను, అలాగే ప్యానెల్ సభ్యుల నియామకాన్ని అడ్డుకోవడానికి జరుగుతున్న విస్తృత ప్రయత్నంలో భాగమే ఈ వీటోలు అని పేర్కొన్నారు.

ఈ ఆంక్షలు చట్టవిరుద్ధం : రష్యా
మరోవైపు, ఇరాన్‌పై ఆంక్షలను తిరిగి విధించడం చట్టవిరుద్ధమని ఇరాసలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా అభిప్రాయపడ్డారు. అందువల్ల ఐక్యరాజ్యసమితి నిపుణుల కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానం వీగిపోయిందన్నారు. ఈ తీర్మానం తీవ్రమైన లోపాలతో కూడుకున్నదని, దానికి ఎటువంటి చట్టపరమైన ఆధారం లేదని ఆరోపించారు. ఈ తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టవద్దని రష్యా, చైనాలు అమెరికాను, దాని మిత్రదేశాలను గట్టిగా కోరాయని గుర్తు చేశారు.
అమెరికాలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు పర్యటన
పశ్చిమాసియా యుద్ధం వేళ కీలక పరిణామం జరిగింది. వచ్చే వారం న్యూయార్క్ నగరంలో జరగబోయే ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్‌జీఏ) 81వ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆరాగ్చీ సహా ఇతర కీలక నేతలు అమెరికా వెళ్లనున్నారు. యుద్ధం వేళ ఆ నేతల వీసాలకు అమెరికా ఆమోదం తెలపడం గమనార్హం.
పాలస్తీనా అధ్యక్షుడికి అమెరికా షాక్
ఇరాన్ అధ్యక్షుడు, ఇతర ప్రతినిధుల వీసాలు ఆమోదించిన అమెరికా పాలస్తీనాకు షాకిచ్చింది. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, ఆయన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందానికి మాత్రం వీసాలను తిరస్కరించింది. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం విషయంలో తమ వాగ్దానాలను నిలుపుకోవడంలో పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ సహా ఇతర ఉన్నతాధికారులు విఫలయ్యారని ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది.

అటవీ భూములపై రెవెన్యూ జోక్యం వద్దు- పట్టాలు ఇచ్చే అధికారం లేదు.. ఆక్రమణలు వెంటనే తొలగించాలి- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యవహారంపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు





హైదరాబాద్,ధరణి న్యూస్, సెప్టెంబర్ 18–, అటవీ భూముల పరిరక్షణ విషయంలో తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అటవీ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వడం సరికాదని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎంత ఒత్తిడి తెచ్చినా అటవీ భూములకు పట్టాలు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. అటవీ భూములపై రెవెన్యూ అధికారులకు ఎలాంటి హక్కులు లేవని వ్యాఖ్యానించింది. అడవులు పర్యావరణానికి ప్రాణవాయువునిచ్చే ఊపిరితిత్తుల వంటివని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ధర్మాసనం పేర్కొంది. అటవీ భూముల విషయంలో రెవెన్యూ శాఖ అనవసరంగా జోక్యం చేసుకోవడం అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అటవీ అధికారులను సంప్రదించిన తర్వాతే అటవీ భూములకు సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.
ఆక్రమణలు వెంటనే తొలగించాలి
అటవీ భూములు అడవులకే చెందాలని, వాటిని ఇతర అవసరాలకు మళ్లించడం, ఆక్రమణలకు అవకాశం కల్పించడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు అటవీ భూముల్లో జారీ చేసిన పట్టాల విషయంలోనూ న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోమని ధర్మాసనం పేర్కొంది.
కలెక్టర్‌కు సమన్లు
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ భూములకు సంబంధించిన వ్యవహారంపై జిల్లా కలెక్టర్ మధ్యాహ్నం 2.15 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. జిల్లా అటవీ అధికారి (ఐఎఫ్ఓ)తో కలెక్టర్ సరైన సమన్వయంతో ఎందుకు చర్చలు జరపడం లేదో పూర్తి వివరాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అటవీ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులను తప్పనిసరిగా పాటించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి అటవీ భూముల పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

సైనసైటిస్‌కు స్వస్తి

వాన చినుకులకు కొందరు మురిసిపోతారు. కానీ మరికొందరు భయపడతారు. వర్షంలో తడిస్తే ఆరోగ్య సమస్యలు ఎక్కడ వస్తాయోనని వారి బాధ. చలికి.. చల్లగాలికి.. వర్షానికి అలా వేధించే సమస్యే సైనసైటిస్. చూడడానికి చిన్న సమస్యగానే కనిపించినా ఇది ప్రమాదకరమైంది. దీనినెలా గుర్తించాలి? చికిత్స ఏంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తెలుసుకొని సైనస్‌కు స్వస్తి పలుకుదాం.ఆధునిక జీవనశైలి సైనసైటిస్ సమస్యను తీవ్రతరం చేస్తున్నది. ప్రతి పదిమందిలో ఐదుగురు సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి లోపించడం కూడా దీనికి కారణం అవుతున్నది. వాతావరణంలో మార్పులు వస్తే కొందరు ఎక్కడ తమకు సైనసైటిస్ సమస్య వస్తుందేమోనని భయపడుతున్నారని చెప్తున్నారు సౌత్ కొరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఉల్సాన్ నిపుణులు. జీవనశైలి మార్చుకుంటే ఈ సమస్యను ప్రారంభంలోనే అధిగమించవచ్చు అని చెప్తున్నారు.





సైనసైటిస్ అంటే?: కపాలంలో గాలితో నిండిన కుహరాన్ని సైనస్ అంటారు. మ్యూకస్ మెంబ్రేన్ అనే మెత్తటి పొరతో సైనస్ కప్పబడి పలుచటి ద్రవపదార్థాన్ని తయారుచేస్తుంది. ఇది మనం ఊపిరి పీల్చినప్పుడు శరీరంలోకి ప్రవేశించిన గాలికి సరైన ఉష్ణోగ్రత, తేమ కల్పిస్తుంది. కపాలంలోని ఎముకల్లో గాలి ఉండడం వల్ల వాటి బరువు తగ్గించడంలో క్రియాశీలకంగా పనిచేస్తుంది. అంతేకాదు.. మనం మాట్లాడినప్పుడు శబ్దం రావడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. కొన్నిసార్లు ఎలాంటి పొర అడ్డులేకుండా సైనస్ నేరుగా ముక్కు రంధ్రంలోకి తెరుచుకుంటుంది. ఆ సమయంలో ప్రవించిన స్రావాలు వాటి మార్గంలో అడ్డుపడటం వల్ల శ్వాస సమస్యలు ఏర్పడుతాయి. దీనినే సైనసైటిస్ అంటారు.

లక్షణాలు : తలనొప్పి, ముక్కు దిబ్బడ, నీరు కారడం, దగ్గు, జలుబు సైనసైటిస్ లక్షణాలు. వాతావరణం మారినప్పుడల్లా వైరస్, బాక్టీరియా, ఇన్ఫెక్షన్ల వల్ల సైనసైటిస్ వస్తుంటుంది.

ఎన్ని రకాలు? : సింపుల్‌గా చెప్పాలంటే కళ్లు, ముక్కు, పక్కభాగం ఎముకల్లో ఉండే సన్నని గాలితో నిండిన సైనస్ భాగం ఇన్ఫెక్షన్లతో వాచిపోవడాన్ని సైనసైటిస్ అంటారు. దీనిలో ఫ్రాంటల్, పారానాసల్, ఎత్మియిటల్, యాగ్జిలరీ, స్పినాయిడల్ వంటి రకాలు ఉన్నాయి. కానీ ముఖ్యంగా వీటిని మూడు రకాలుగా చెప్తారు. ఒక్కో దశలో ఒక్కో రకమైన తీవ్రతతో ఉంటుంది.

1. **అక్యూట్ సైనసైటిస్**
2. **సబ్ అక్యూట్ సైనసైటిస్**
3. **క్రానిక్ సైనసైటిస్**

అక్యూట్ సైనసైటిస్ వారం రోజులుంటుంది. సబ్ అక్యూట్ 4-8 వారాలుంటుంది. క్రానిక్‌ను దీర్ఘకాలిక సైనసైటిస్ అంటారు. ఇది 8-10 వారాలు బాధిస్తుంది. ఇండియాలో కన్నా అమెరికాలో సైనసైటిస్ సమస్యలు ఎక్కువ అని సర్వేలు చెప్తున్నాయి. 2.4 లక్షల మంది అమెరికన్లు సైనసైటిస్‌తో బాధపడుతున్నారట. వ్యాధిని తేలికగా తీసుకోవడమే వ్యాధి తీవ్రతకు కారణంగా చెప్పుకోవచ్చు. ఆపరేషన్ చేసినా కూడా సరైన జీవనశైలి లేకపోతే ఈ సమస్య మళ్లీ వచ్చే ప్రమాదం ఉంది.

ఎలాంటి సమస్యలు?: సైనసైటిస్ వల్ల సైనస్ భాగంలో తీవ్రమైన ఒత్తిడి, నొప్పి కలుగుతాయి. చీముతో కూడిన స్రావాలు ముక్కు నుంచి బయటకు వస్తాయి. ముక్కు దిబ్బడగా ఉంటుంది. ముక్కులో ఇన్ఫెక్షన్లు మొదలవుతాయి. కొన్నిసార్లు సూక్ష్మజీవులు ఎక్కువగా ఉన్న నీళ్లలో ఈత కొట్టడం వల్ల అవి సైనస్‌లోకి ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. స్విమ్మింగ్ పూల్స్‌లో క్లోరిన్ ఎక్కువగా ఉంటే కూడా ఆ గాలి ముక్కు రంధ్రాల ద్వారా సైనస్‌లోకి చేరి మ్యూకస్ మెంబ్రేన్ వాచిపోతుంది. దంతాలలో వచ్చే ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా సైనస్ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలికంగా సైనసైటిస్ వ్యాధితో బాధపడే వారు కనురెప్పల వాపు, కనుగుడ్లు పక్కకు జరిగి ఉండటం, కన్ను నరం దెబ్బతిన్నపుడు చూపు కోల్పోవడం, వాసన తెలియక పోవడం, తరచూ జ్వరం రావడం, ఎదుగుదల లోపాలు వంటి సమస్యలు వస్తాయి.

ఇతర సమస్యలూ కారణమే: వేరే ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే వాటి వల్ల కూడా సైనసైటిస్ సోకుతుంది. పుష్టికరమైన ఆహారం తీసుకోకపోవడం, చికెన్ పాక్స్, కోరింత దగ్గు, డయాబెటీస్ సమస్యలు ఉన్నట్లయితే సైనసైటిస్ వస్తుంది. చాలా కేసుల్లో సైనసైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. తర్వాత బాక్టీరియా చేరి సైనస్ సమస్యగా మారుతుంది. ఈ హానికర సూక్ష్మజీవుల్లో స్ట్రెప్టోకోకస్ న్యుమోనియా, హీమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా, స్టెఫైలోకోకస్ ఆర్ఈయస్ వంటి వాటివల్ల కూడా సైనసైటిస్ సమస్య వస్తుంది. మ్యూకోసల్ మెంబ్రేన్, సైనస్ ఎముకల మీద కూడా ప్రభావం వల్ల.. దంతాలకు ఉన్న అంటు సైనస్‌లకు వ్యాపించడం వల్ల సైనసైటిస్ సమస్య వస్తుంది.వ్యాధి నిర్ధారణ: ముఖం భారంగా ఉండటం, తలనొప్పి, గొంతులోకి ద్రవం కారటం, చెవిలో చీము పట్టడం, కోపం, మానసిక స్థైర్యం కోల్పోవటం, అలసట, విసుగు, పనిపై శ్రద్ధ లేకపోవటం వంటి లక్షణాలు వరుస క్రమంలో ఉంటే సైనసైటిస్‌గా గుర్తించాలి. దీనిని సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ద్వారా నిర్ధారిస్తారు.

కారణమేంటి?

సైనస్‌లో సరైన వెంటిలేషన్ లేకపోవడం ముఖ్య కారణం. సాధారణంగా సైనస్‌లో మ్యూకస్ ద్రవాలు సీలియరీ మూమెంట్ వల్ల ఆస్టియాను చేరి అక్కడ నుంచి ముక్కు రంధ్రాల్లోకి చేరుతాయి. ఇది జరుగకుండా సైనస్‌లో తయారయ్యే పదార్థాలు నిల్వ ఉండి విధులకు ఆటంకం కలిగిస్తాయి. ముఖ్యంగా నాసికా కవచం, స్ఫుటం నిర్మాణంలో తేడాలు ఏర్పడతాయి. కొందరికి ముక్కులోని ద్రవాల చిక్కదనం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఒకసారి సైనసైటిస్ వచ్చి మ్యూకోసా దెబ్బతింటే పదే పదే వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణం తేమగా, చల్లగా ఉన్నప్పుడు వాటి ప్రభావం వల్ల సైనసైటిస్ వస్తుంది.

చికిత్స: అమాక్సిసిల్లిన్ లేదా ఆంపిసిల్లీన్ మందులు ఇవ్వవచ్చు. ఓరల్ డ్రిక్సోరాల్, డిమెటాప్ మందులతో కూడా తగ్గుతుంది. స్టీమ్‌ను పీల్చుకొనుట ద్వారా హీట్‌ను కలిగించుట ద్వారా ముక్కు నుంచి స్రావాలు బయటకు రప్పించి ఉపశమనం కలిగించవచ్చు. నాసల్ స్ప్రేలు కొంతవరకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. మందులకు తగ్గకపోతే మాత్రం శస్త్రచికిత్స ద్వారా సైనస్‌కు కారణమైన దుర్మాంసాన్ని తొలగించవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎలర్జీ కలిగించే వస్తువులను దూరంగా ఉంచాలి.
- తగిన పోషకాహారం తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవాలి.
- శ్వాసకోశ అంటువ్యాధులతో బాధపడుతూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి.
- శ్వాసకోశ వెలుపలి భాగాల్లో అంటు 7- 10 రోజుల కంటే ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి.
- ముక్కు నుండి వచ్చే స్రావాల రంగు మారినా లేదా చెడు వాసన వస్తున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.
- టాన్సిలైటిస్‌తో బాధపడుతున్నవారు వెంటనే ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలి.



వయసును మరిపించి.. దీర్ఘాయువుకు బాటలు పరిచి..!

శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, పోషకాల గనిగా పేరొందిన మష్రూమ్స్ ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. మష్రూమ్స్‌లో ఔషధ గుణాలు పుష్కలంగా లభిస్తుండటంతో ఇవి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఆహారంగా పేరొందాయి. వయసు మీదపడటం ద్వారా వచ్చే లక్షణాలను దీటుగా నిలువరించి వృద్ధాప్యాన్ని జాప్యం చేయడంలో మష్రూమ్స్ కీలకంగా పనిచేస్తాయని చెబుతున్నారు.ఏజింగ్‌కు అడ్డుకట్ట వేసి ఆరోగ్యానికి మేలు చేకూర్చే యాంటీఆక్సిడెంట్స్ వీటిలో లభిస్తాయి. వీటిని తరచూ తీసుకుంటే దీర్ఘాయువు చేకూరడంతో పాటు ఆరోగ్యంగా వయసు మీరే ప్రక్రియకు తోడ్పాటు అందిస్తాయి. లీషీ మష్రూమ్స్ అనే వెరైటీ పుట్టగొడుగులు ఆరోగ్యం, దీర్ఘాయువును అందిస్తుంది. అందుకే వీటిని దశాబ్దాలుగా చైనా వైద్య ప్రక్రియల్లో వినియోగిస్తున్నారు.మష్రూమ్స్‌లో దీర్ఘాయువును ప్రేరేపించే ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, వాపు ప్రక్రియను నివారిస్తాయని 2021లో న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది. మష్రూమ్స్ బీపీని తగ్గించడంతో పాటు మధుమేహ నియంత్రణ, కొవ్వును తగ్గించడం, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రేవుల ఆరోగ్యాన్ని కాపాడటం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలకు ఉపకరిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

చిన్న పిల్లల్లో ఇమ్యూనిటీ పెరగాలంటే ఏం చేయాలి?

పెద్దలైనా, పిల్లలైనా వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే రోగ నిరోధక శక్తి మెరుగ్గా ఉండాలి. అప్పుడే ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉంటారు. అయితే, పసిపిల్లలకు ఇమ్యూన్ సెల్స్ తల్లి పాల ద్వారా వస్తాయి. అలాగే, వయసుకు తగిన వ్యాక్సిన్లు వేయిస్తుంటే, చాలా రకాల ఇన్ఫెక్షన్ల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చు. అలాగే పోషకాహారం అందించడం ద్వారా కూడా ఇమ్యూనిటీ పెరుగుతుంది. తల్లి పాలలోని కొలోస్ట్రమ్ పిల్లల్లో ఇమ్యూనిటీని పెంచుతుంది. పుట్టినప్పటి నుంచీ కనీసం ఆరు నెలలపాటు తల్లి పాలు తాగితే వాళ్ల రోగ నిరోధక వ్యవస్థ బలంగా ఉంటుందని ఎన్నో అధ్యయనాలు చెప్తున్నాయి.ఖనిజ లవణాలన్నిటిలోకి జింక్ పిల్లల ఇమ్యూనిటీ సిస్టమ్‌పై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఇది బీన్స్, నట్స్ వంటి ప్రొటీన్ ఫుడ్స్‌లో పుష్కలం.తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని యాంటీ ఆక్సిడెంట్స్ కణాలను పాడవకుండా కాపాడుతాయి. వ్యాధుల బారినుంచి రక్షిస్తాయి. బెర్రీస్, బ్రొకోలీ, పాలకూర, ఆవాల ఆకులు (మస్టర్డ్ లీవ్స్) మొదలైన వాటిలో యాంటీ ఆక్సిడెంట్స్ చాలా ఉంటాయి.గట్ హెల్త్ కూడా చాలా ముఖ్యం. జీర్ణ వ్యవస్థ పనితీరు బాగుంటేనే ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. శరీరంలో మంచి బ్యాక్టీరియా పెరగాలన్నా, పేగు మార్గాలు దృఢంగా ఉండాలన్నా ప్రోబయాటిక్స్ పుష్కలంగా ఉండే ఆహారం పిల్లలకు ఇవ్వాలి. రోజూ పెరుగుతోపాటు ఒక పండు కచ్చితంగా పెట్టాలి. కొంచెం పెద్ద పిల్లలైతే పెరుగులో క్యారెట్, కీరా తరుగు వేసి ఇస్తే ఇష్టంగా తింటారు. పిల్లలకు రోజూ 10 నుంచి 14 గంటల నిద్ర అవసరం. అది కూడా మధ్యలో ఎలాంటి ఆటంకం లేకుండా




ఉండాలి. రాత్రి నిద్ర పుచ్చే ముందు గోరు వెచ్చని నీళ్లతో స్నానం చేయించడం, లైట్‌గా మసాజ్ చేయడం, కొంతసేపు పుస్తకం చదివించడం వంటివి చేయాలి. సరిపడా నిద్రపోయే పిల్లలు అంత త్వరగా ఇన్ఫెక్షన్ల బారిన పడరు.

యాంటీ బయాటిక్స్ త్వరగా పని చేస్తాయన్న మాట నిజమే. అయినా సరే, వాటికి దూరంగా ఉండాలి. ఎందుకంటే, అవి శరీరంలోని మంచి బ్యాక్టీరియాను పూర్తిగా తొలగిస్తాయి. దానివల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది.

నైట్ షిఫ్ట్ చేస్తున్నారా? ఆరోగ్యం కోసం కచ్చితంగా పాటించాల్సిన రూల్స్ ఇవే!!

చాలామంది ఐటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు రాత్రిళ్లు పని చేస్తూ ఉంటారు. ఇక నైట్ షిఫ్ట్ డ్యూటీ చేసే వాళ్ళు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుంది. నైట్ షిఫ్ట్ చేసేవాళ్ళు ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఇప్పుడు తెలుసుకుందాం. నైట్ షిఫ్ట్ డ్యూటీ చేసే వాళ్ళు నిద్ర ఆపుకోవటానికి ఏది పడితే అది తినటం, తాగటం చేస్తుంటారు. కానీ అది మంచిది కాదు. అర్ధరాత్రి దాటిన తర్వాత నిద్ర వస్తుందని కాఫీలు, టీలు తాగకూడదు . దీంతో ఉదయం నిద్ర పోవడానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఉంటుంది. అంతేకాదు అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. నైట్ షిఫ్ట్ చేసేవాళ్ళు శరీరం డీహైడ్రేట్ కాకుండా నీరు ఎక్కువగా తాగాలి . మజ్జిగ, జావా ఇలాంటివి తీసుకోవాలి. దీంతో శరీరం అలసి పోకుండా ఉంటుంది. నైట్ డ్యూటీ చేసే వాళ్ళు రాత్రివేళ మసాలాలు, కొవ్వు అధికంగా ఉండే ఆహారాలు, కార్బోహైడ్రేడ్స్ ఎక్కువగా ఉండే ఆహారాలు తినకూడదు. ఒకవేళ రాత్రి సమయంలో తినాలి అనుకుంటే డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్, సలాడ్స్ వంటివి తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.



హరిహర వీరమల్లు షూటింగ్ లో భారీ అగ్నిప్రమాదం...

ఉదయం, సాయంత్రం కాసేపైనా వ్యాయామం యోగా వంటివి చేస్తే శారీరక, మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉండదు.మద్యపానం అస్సలు మంచిది కాదు. నైట్ షిఫ్ట్ చేసేవాళ్ళు మద్యం సేవిస్తే పని సరిగా చేయలేక ఒత్తిడితో ఇబ్బంది పడతారు.కాబట్టి జాగ్రత్త. ప్రతిరోజూ కాసేపు ఎండ తగిలేలా చూసుకోవాలి. శరీరానికి ఎండ తగలకుండా ఉంటే ఆరోగ్యం పాడవుతుంది. ఇక నైట్ డ్యూటీ చేసే వాళ్ళు నిద్రపోయే సమయాన్ని విభజించుకోవాలి. వాళ్ళు నిద్ర పోవాలి ఉదయం పూట నాలుగు గంటలు, మళ్లీ డ్యూటీ సమయానికి ముందు మరో రెండు మూడు గంటలు నిద్ర పోవాలి. నిద్ర పోవడానికి వీలుగా ఇంట్లో బెడ్ రూమ్ సిద్ధం చేసుకొని, కుటుంబ సభ్యులకు సహకరించవలసిందిగా ముందే చెప్పి పెట్టుకోవాలి. నిద్ర సమయంలో సెల్ ఫోన్ మ్యూట్ పెట్టుకుంటే మంచిది. రాత్రివేళ డ్యూటీ చేసే వాళ్ళు ఇంట్లో పనులు చేయడానికి కూడా నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించుకోవాలి. పక్కాగా షెడ్యూల్ చేసుకోవాలి.మధుమేహం, హైబీపీ ఉన్నవారు ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి. శరీరంలో ఏ చిన్న మార్పు కనిపించినా వైద్యుల్ని సంప్రదించి వైద్యుల సూచన ప్రకారం మందులు వాడాలి.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

సక్సెస్ లోడింగ్!





తయారీ రంగంలో ఇప్పటికీ పురుషులదే పెత్తనం. అందులోనూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో మగవారిదే ఆధిపత్యం. ఈ రెండు పరిమితులనూ అధిగమించి.. అమెరికా మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాన్ని అందుకున్నారు రష్మి వడ్లకొండ.

మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలో మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించే రోజు ఎంతో దూరం లేదంటారు రష్మి వడ్లకొండ. ఈ యువతి వృత్తిరీత్యా మెకానికల్ ఇంజినీర్. ఉత్పాదక రంగంలో తమదైన ప్రతిభ కనబరుస్తూ.. నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్న మహిళలకు అమెరికాలోని ద మాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏటా 'ఉమెన్ మేక్' అవార్డులను అందజేస్తుంది. తాజాగా ఐర్లాండ్ వేదికగా జరిగిన సదస్సులో ఈ ఏడాదికిగాను ఆ పురస్కారం సాధించి ఎమర్జింగ్ లీడర్‌గా నిలిచారు రష్మి.

ఐర్లాండ్ రాజధాని డబ్లిన్ కేంద్రంగా పనిచేస్తున్న ట్రేన్ టెక్నాలజీస్‌లో రష్మి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్రీడీ ప్రింటింగ్‌లో ఆ సంస్థకు తను సాంకేతిక సలహాదారు. దాంతోపాటే, క్యాంపస్ నుంచి అప్పుడే బయటికొచ్చిన యువ ఇంజినీర్లకూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉమెన్ ఇన్ మాన్యుఫ్యాక్చరింగ్ (డబ్ల్యూఐఎమ్) అసోసియేషన్ సౌత్ కరోలినా చాప్టర్‌కు వైస్ చైర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఇంటర్నల్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా.. ఈ రంగంలోకి వచ్చే మహిళలను ప్రోత్సహిస్తున్నారు. పట్టుదలతో పనిచేస్తే పురుషులతో పోటీపడటం అసాధ్యం కాదని భరోసా ఇస్తారామె. రష్మి నాయకత్వ ప్రతిభను ట్రేన్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైరీడ్ మాగ్నెనర్ కొనియాడారు కూడా.

పక్కా హైదరాబాదీ

రష్మి నేపథ్యమంతా హైదరాబాద్ చుట్టూనే తిరుగుతుంది. ఇక్కడే పుట్టిపెరిగారామె. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. కొంతకాలం క్యాంపస్‌లోనే రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేశారు. తర్వాత సైయెంట్ టెక్నాలజీస్‌లో ఏడాదిపాటు ఉద్యోగం చేశారు. అనంతరం అమెరికా వెళ్లి నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివారు. 'ఓ కొత్త వస్తువుకు రూపం ఇవ్వడం అనేది.. ఓ జీవికి ప్రాణం పోసినంత గొప్ప పని. బాల్యం నుంచీ నన్ను కొత్తకొత్త ఆవిష్కరణలు ఆకట్టుకునేవి. భిన్నంగా ఆలోచించేలా ప్రేరేపించేవి. వైద్యం, సాహిత్యం, రాజకీయం.. ఇలా అన్ని రంగాల్లో మహిళలు రోల్ మోడల్‌గా ఉన్నారే? ఇక్కడ మాత్రం ఎందుకులేరనే ప్రశ్న వెంటాడేది. అదే నాతో మెకానికల్ ఇంజినీరింగ్ వైపు అడుగులు వేయించింది' అంటారు రష్మి.

కూతురి తపనను కన్నవారూ అర్థం చేసుకున్నారు. తమవంతుగా ప్రోత్సహించారు. సివిల్, మెకానికల్, ట్రిపుల్-ఈ వంటి కోర్సులలో యువతులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. తను చదువుకునే రోజుల్లోనూ అంతే. క్లాస్‌రూమ్‌లో అమ్మాయిల సంఖ్య పదిహేను లోపే. మాస్టర్స్ చదువుతున్న రోజుల్లోనూ అదే పరిస్థితి. పదిమంది విద్యార్థులు ఉంటే.. తానొక్కతే అమ్మాయి. అసలే క్లిష్టమైన సబ్జెక్ట్, దానికితోడు ఒంటరిననే భావన. అన్నీ వదిలేసి ఇంటికి రావాలనే ఆలోచన వచ్చేదట. అదీ తాత్కాలికమే. అంతలోనే గుండెనిండా ఆత్మవిశ్వాసం నింపుకొనేవారామె. మెటల్ ఎడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో లోతైన అధ్యయనం చేశారు.

మాస్టర్స్ తర్వాత ట్రేన్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం రష్మి జీవితంలో ఓ మలుపు. ఓ మామూలు ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించి.. కంపెనీకి అవసరమైన సాంకేతికతను అందించే స్థాయికి చేరుకున్నారు. వివక్షకు తావులేకుండా మహిళలకు అవకాశాలు కల్పిస్తే కంపెనీలైనా, కుటుంబాలైనా వృద్ధి చెందుతాయి. అప్పుడే, మహిళల సత్తా వెలుగులోకి వస్తుంది. అమెరికాలో, భారత్‌లో.. ఈ విషయంలో జరగాల్సింది చాలా ఉంది' అంటారు రష్మి ఆశావాదం ప్రతిధ్వనించేలా. అవును. తను చెప్పినట్టు.. ముందుంది మంచికాలం.

తనవైన అభిరుచులు

'రష్మికి యోగా అంటే ప్రాణం. 'ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన మనసు యోగాతోనే సాధ్యం' అంటారామె. తను ఫ్యాషన్ ప్రేమికురాలు. ట్రెండ్స్‌ను ఇష్టపడతారు. కొత్త ధోరణులను సాధికారికంగా విశ్లేషించగలరు కూడా. అప్పుడప్పుడూ ర్యాంప్ మీద మెరుపులు మెరిపిస్తారు. 'రేపటి తరం కోసం.. అందులోనూ మహిళల కోసం తయారీ రంగానికి సువిశాలమైన మార్గాన్ని సిద్ధం చేద్దాం' అంటూ పిలుపునిస్తారు రష్మి.

పాదాల్లో పగుళ్లు వేధిస్తున్నాయా.. అయితే ఈ చిట్కాలు మీ కోసమే



అందంగా కనిపించడం కోసం చాలా మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. మెరిసే చర్మం కోసం క్రీములు, లోషన్‌లు రుద్దుతుంటారు. హెయిర్ కటింగ్‌లో, వస్త్రధారణలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ పాదాల సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తుంటారు. కానీ, సుతిమెత్తగా ఉండాల్సిన పాదాలలో పగుళ్లు వస్తే తీవ్రంగా బాధిస్తాయి. అయితే, కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా సమస్య నుంచి సులువుగా బయటపడవచ్చు. మరి ఆ చిట్కాలు ఏంటో చూద్దామా..?

పాద సంరక్షణకు చిట్కాలు..

1. నోటి శుభ్రత కోసం ఉపయోగించే మౌత్‌వాష్ పౌడర్ చర్మానికి తేమను అందిస్తుంది. ఒక వెడల్పాటి బకెట్‌లో కొంచెం మౌత్‌వాష్ పౌడర్, నీళ్లు కలిపి అందులో పాదాలను 15 నిమిషాలపాటు ఉంచాలి. తర్వాత వేరే నీళ్లతో పాదాలను శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

2. యాంటీ మైక్రోబయల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్న తేనె పగిలిన పాదాలకు చక్కని మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. పాదాలకు పగుళ్లు ఉన్నచోట కొద్దిగా తేనె రాసుకొని అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తే పాదాలకు నిగారింపు వస్తుంది.

3. కొబ్బరి నూనె కూడా పొడి చర్మానికి తేమను అందించి తాజాగా మారుస్తుంది. రాత్రిపూట నిద్రపోయే ముందు పాదాలకు కొబ్బరి నూనె రాసుకుంటే పగుళ్ల బాధ తగ్గుతుంది.

4. సాధారణంగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌ల వల్ల కూడా పాదాల్లో పగుళ్లు వస్తాయి. అలాంటప్పుడు వెనిగర్ కలిపిన నీటిలో పాదాలను కొద్దిసేపు ఉంచితే పగుళ్లు తగ్గి ఉపశమనం లభిస్తుంది.

5. అదేవిధంగా పగిలిన పాదాలకు ఓట్‌మీల్, పాల మిశ్రమం కూడా మంచి ఔషధంగా పనిచేస్తుంది. ప్రతివారం ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకుంటే పగుళ్లు మాయమవుతాయి.


పబీబెన్.కామ్



షార్క్ ట్యాంక్.. సోనీ లివ్‌లో టెలికాస్ట్ అవుతున్న ఓ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్. ఐఐటీలు, ఐఐఎమ్‌ల పట్టభద్రులు ఆ వేదిక మీద బిజినెస్ ఐడియాలను పంచుకుంటారు. తమ ప్రణాళికలు వివరిస్తారు. అంకెల మంత్రమేసి ఇన్వెస్టర్లను ఆకర్షిస్తారు. పబీబెన్‌లాంటి మహిళలు అక్కడి దాకా రావడం అరుదు. పబీబెన్.. నిరక్షరాస్యురాలు. గుజరాత్, కచ్ ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెలో పుట్టింది. పేదరికం మధ్య పెరిగింది. పశువులు మేపేందుకు వెళ్లేది. వెళ్తూ వెళ్తూ కాలక్షేపానికి ఎంబ్రాయిడరీ సామగ్రి తీసుకెళ్లేది. బట్టల మీదే కాదు, అలంకరణ వస్తువుల మీదా ముచ్చటగా ఎంబ్రాయిడరీ చేయగలదు తను. నీలేశ్ థాపర్ అనే వ్యాపారవేత్తకు పబీబెన్ పనితనం గురించి తెలిసింది. తనే చొరవ తీసుకుని ఆమెతో ఓ కంపెనీ పెట్టించాడు. ఇప్పుడు ఆ సంస్థలో యాభైమంది ఎంబ్రాయిడరీ నిపుణులు ఉన్నారు. షార్క్ ట్యాంక్ వేదికపై.. పబీబెన్ ఆలోచనలు నచ్చి యాభై లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు ఓ ఇన్వెస్టర్. ప్రస్తుతం పబీబెన్.కామ్ వార్షిక టర్నోవర్ రూ. రెండు కోట్లు. 'సిగ్గు పడకండి. మొహమాటం వద్దు. భయపడొద్దు. మీ కలల్ని నిజం చేసుకోండి' అని తోటి మహిళలకు సలహా ఇస్తారు పబీబెన్.

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ ఎందుకొస్తుంది? ఇది అంత ప్రమాదమా?

గర్భధారణ అనే ప్రక్రియ.. అండంతో శుక్రకణం కలిశాక, అది పిండంగా ఏర్పడ్డ సమయం నుంచి మొదలవుతుంది. అండంతో శుక్రకణం కలవడాన్ని 'ఫలదీకరణ' అంటారు. ఫలదీకరణ జరిగాక ఏర్పడ్డ పిండం గర్భసంచిలో పెరగాలి. కానీ, కొన్ని సందర్భాల్లో గర్భసంచిలో కాకుండా.. దాని పరిసరాల్లో పిండం పెరగడాన్ని 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ' అంటారు. అండాశయం (ఓవరీస్) నుంచి అండాన్ని గర్భసంచిలోకి వచ్చేలా తోడ్పడే ట్యూబ్స్‌ను 'ఫెలోపియన్ ట్యూబ్స్' అంటారు. కొన్ని సందర్భాల్లో పిండం గర్భసంచిలో బదులు ఈ ఫెలోపియన్ ట్యూబుల్లో పెరగడంతోపాటు ఒక్కోసారి అండాశయాల్లో (ఓవరీస్), కాస్తంత కిందికి వస్తే గర్భాశయ ముఖద్వారంలో.. ఒక్కోసారి కడుపులో కూడా పెరగవచ్చు. ఈ సమస్యనే 'ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ'గా వ్యవహరిస్తారు.



ఇలాంటి సందర్భాల్లో సాధారణ గర్భధారణలోలా పిండం ఏర్పడటం, ఆ తర్వాత అది శిశువుగా రూపొందే ప్రక్రియ జరగదు. ఫలితంగా ఆ పిండంలో మనుగడ కొరవడుతుంది. అంతేకాదు.. ఒక్కోసారి అరుదుగా తల్లిలో రక్తస్రావానికి కారణమై, ఆమెకు కూడా ముప్పు తెచ్చిపెడుతుంది.

లక్షణాలు :

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో మొదట్లో ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అయితే కొంతమందిలో గర్భధారణలో కనిపించినట్టే పీరియడ్స్ ఆగిపోవడం, వికారం, వాంతులు కనిపిస్తాయి. అంతేకాదు.. మామూలుగా తమకు తాముగా చేసుకునే ప్రెగ్నెన్సీ పరీక్షల్లోనూ ఫలితాలు 'పాజిటివ్' అని వస్తాయి. అయితే, మామూలుగా పిండం ఎదుగుదల గర్భసంచిలో మాత్రమే ఉంటుంది. కానీ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో పిండం ఎక్కడో గర్భసంచి బయట ఏర్పడుతుంది. కాబట్టి, పిండం ఎదుగుదల నార్మల్‌గా ఉండదు. ఎప్పుడు అనుమానించాలి? డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి అంటే?

- ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించడానికి తోడ్పడే కొన్ని లక్షణాలు ఇలా వ్యక్తమవుతాయి.
- తొలిదశల్లో యోని నుంచి రక్తస్రావం కావడం, పొత్తికడుపులో నొప్పి రావడం ద్వారా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా అనుమానించాలి.
- తల తేలికైపోయిన ఫీలింగ్‌తోపాటు స్పృహ తప్పవచ్చు.
- భుజం నొప్పి కూడా కనిపించవచ్చు.
- ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణం డాక్టర్‌ను కలవాలి.

ఎవరెవరిలో ముప్పు ఉంటుందంటే?

- మొదట ఒకసారి ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చి ఉన్నవాళ్లలో మరోసారి కూడా వచ్చే అవకాశముంది.
- జీవిత భాగస్వామి నుంచి గనేరియా, క్లమీడియా వంటి కొన్ని లైంగిక సంబంధిత ఇన్ఫెక్షన్లు సోకిన మహిళల్లో ఈ ముప్పు కనిపించవచ్చు.
- సంతాన సాఫల్యత కోసం చికిత్సలు తీసుకుంటున్నవారిలో.
- ఫెలోపియన్ ట్యూబుల్లో లోపాలుండి, వాటిని సరిదిద్దేందుకు శస్త్రచికిత్స తీసుకున్నవారిలో.
- పొగతాగే అలవాటు ఉన్న మహిళల్లో ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీకి అవకాశాలు ఎక్కువ.

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ కాంప్లికేషన్లు

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ చాలావరకు ఫెలోపియన్ ట్యూబుల్లో పెరుగుతుంది. ఆ పెరుగుదలకు తగినట్లుగా సాగలేక ట్యూబులు గాయపడవచ్చు. ఫలితంగా గాయపడ్డ ట్యూబుల్లోంచి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ఇలా ఆగకుండా అయ్యే రక్తస్రావంతో ఒక్కోసారి తల్లి ప్రాణానికే ముప్పు రావచ్చు.

నివారణ

- పొగతాగే అలవాటుకు పూర్తిగా దూరంగా ఉండటం. ఇది ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ నివారణకే కాదు.. అనేక ఇతర అనారోగ్యాలనూ నివారిస్తుంది.
- లైంగిక సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధులను నిర్ధారించడం
- ముందస్తుగా చేసే నిర్ధారణ మరియు చికిత్స ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో చాలా ముఖ్యం.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

ఏడాదిలోపే చైల్డ్ ఆర్టిస్ట్‌లుగా కెరీర్

సాధారణంగా నటన నేర్చుకోవడానికి ఏళ్ల పడుతుంది. కానీ కొందరు మాత్రం పుట్టిన కొద్ది నెలలకే, అసలు లోకం గురించిన స్పృహ కూడా లేని వయసులోనే కెమెరా ముందుకు వచ్చేశారు. దీఎ: మీఎన్మ్షబ =వఎనఎఎ । 17 జీబశ్రీఎ 2026 12:08మ్రావీ మ్షాష్ణుతీవ: సాధారణంగా నటన నేర్చుకోవడానికి ఏళ్ల పడుతుంది. కానీ కొందరు మాత్రం పుట్టిన కొద్ది నెలలకే, అసలు లోకం గురించిన స్పృహ కూడా లేని వయసులోనే కెమెరా ముందుకు వచ్చేశారు. ఊహ తెలియని ఆ పసి ప్రాయంలోనే వెండితెరపై కనిపించి, ఆ తర్వాత కాలంలో ఇండస్ట్రీని ఏలిన స్టార్ హీరో హీరోయిన్లుగా మారిన కొందరు అరుదైన సెలబ్రిటీల గురించి వింటే ముక్కున వేలేసుకోక తప్పదు. మరి కేవలం ఏడాది లోపు వయసులోనే చైల్డ్ ఆర్టిస్ట్‌లుగా ఎంట్రీ ఇచ్చిన ఆ అద్భుత తారలు ఎవరో ఇప్పుడు చూద్దాం..ఌశ్రీంశీ =ఘఎ – సుజీత్ తర్వాతి అడుగు ఎటువైపు? ఊహ తెలియని వయసులోనే సిసింద్రీ హంగామా: అఖిల్ అక్కినేని పేరు చెప్పగానే మనకు వెంటనే గుర్తొచ్చే సినిమా “సిసింద్రీ” (1995). హాలీవుడ్ క్లాసిక్ ‘బేబీస్ డే అవుట్’ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాలో నటించేటప్పటికి అఖిల్ వయసు కేవలం ఒకే ఒక్క సంవత్సరం. పట్టుమని పది అడుగులు కూడా సరిగ్గా వేయలేని ఆ వయసులోనే టైటిల్ రోల్ పోషించి,



థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించారు అఖిల్. అలా ఏడాది వయసులోనే టాలీవుడ్‌లో ఒక సెన్సేషన్ సృష్టించిన రికార్డు అఖిల్ సొంతం. వీశీజఱవం ఌశ్రీంశీ =ఘఎ – 50 ప్లస్ మలైకాపై నెటిజన్ల ఘాటు విమర్శలు ఌఎజవతీఱంవఎవత్ మూడు నెలల ప్రాయంలోనే కెమెరా ముందుకు శాలిని: మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో హీరోయిన్‌గా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న నటి శాలినీ అజిత్ (బేబీ శాలిని). ఈమె కేవలం 3 నెలల పసిపాపగా ఉన్నప్పుడే ‘ఎంతరల్ తంగం’ అనే మలయాళ చిత్రంతో కెరీర్ ప్రారంభించారు. ఇక ఆ తర్వాత ‘జగదేకవీరుడు అతిలోకసుందరి’ చిత్రంలో బాలనటిగా అద్భుతమైన నటనతో మెప్పించి, పెద్దయ్యాక స్టార్ హీరోయిన్‌గా కూడా తన ప్రత్యేక ముద్ర వేశారు.

ఫౌజీకి కలిసొచ్చిన ప్రభాస్ మార్కెట్..




బెల్ స్టార్ ప్రభాస్ రేంజ్ ఇప్పుడు లోకల్ కాదు, పక్కా గ్లోబల్. ‘బాహుబలి’ నుండి నిన్నటి ‘కల్కి 289 వరకు ఆయన సృష్టించిన బాక్సాఫీస్ రికార్డులే దీనికి నిదర్శనం. ప్రస్తుతం దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో వస్తున్న ‘ఫౌజీ’ చిత్రం షూటింగ్ దశలోనే ట్రేడ్ మార్కెట్‌ను షేక్ చేస్తోంది. కేవలం ఒకే ఒక్క రిలీజ్ డేట్ పోస్టర్, ప్రభాస్ క్రేజ్ తోడై ఈ చిత్రం విడుదలకు ముందే పెట్టుబడిలో సగానికి పైగా రికవరీ సాధించడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇదొక సాధారణ సినిమా కాదు, ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించబోయే విజువల్ ఎపిక్ అని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.– సుజీత్ తర్వాతి అడుగు ఎటువైపు? కళ్ళు చెదిరే ఓటీటీ డీల్ – ప్రభాస్ బ్రాండ్ పవర్: దాదాపు 400 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అయితే సినిమా థియేటర్లలోకి రాకముందే కేవలం సౌత్ ఇండియా భాషల డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులే రికార్డు స్థాయిలో రూ.170 కోట్లకు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హిందీ మరియు మిగతా రైట్స్ ఇంకా లెక్కల్లోకి రాకుండానే ఈ స్థాయి బిజినెస్ జరగడం ప్రభాస్ నెక్స్ట్ లెవెల్ మార్కెట్‌కు నిదర్శనం. దీని బట్టి చూస్తే మేకర్స్‌కు బడ్జెట్ పరంగా సగానికి పైగా సేఫ్ జోన్ వచ్చేసినట్లే. 50 ప్లస్ మలైకాపై నెటిజన్ల ఘాటు విమర్శలు ఓవర్సీస్‌లో హోంభలే హంగామా – నార్త్ అమెరికా గ్రాండ్ రిలీజ్: ఈ చిత్రానికి సంబంధించిన ఓవర్సీస్ థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ ‘హోంభలే ఫిల్మ్స్’ సొంతం చేసుకోవడం సినిమాపై అంచనాలను పెంచేసింది. ప్రభాస్ మార్కెట్ స్టామినాకు, హోంభలే ఫిల్మ్స్ పంపిణీ వ్యూహాలు తోడైతే ఓవర్సీస్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు నమోదు కావడం ఖాయంగా కనిపిస్తోంది. డిసెంబర్ 3న దండయాత్ర: ఇటీవల విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రేక్షకులకు ఫుస్‌బంప్స్ తెప్పించింది. 1940ల బ్రిటిష్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో, రక్తమోడుతున్న దుస్తులతో, చేతిలో కత్తి పట్టుకుని దీర్ఘాలోచనలో ఉన్న ప్రభాస్ లుక్ సినిమాలోని అసలైన భావోద్వేగాలను ప్రతిఫలించింది. ఇక ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ లాంటి దిగ్గజాలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 3న థియేటర్లలోకి రానుంది. ఒక సినిమాపై నమ్మకం ఎంత బలంగా ఉంటే విడుదలకు ముందే ఇలాంటి రికార్డులు సాధ్యమవుతాయో ‘ఫౌజీ’ నిరూపిస్తోంది.

బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న ‘సామజవరగమన’



బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న ‘సామజవరగమన’ బ్యూటీ థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. సుజీత్ తర్వాతి అడుగు ఎటువైపు? పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఌశ్రీంశీ =ఘఎ – 50 ప్లస్ మలైకాపై నెటిజన్ల ఘాటు విమర్శలు బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా – ప్రెగ్నెన్సీ గ్లో: ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది.

మేడం సర్ మేడం అంతే..!



బుట్ట బొమ్మ పూజా హెగ్డే తన ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేయడంలో ఎప్పుడు ముందుంటుంది. తన ఒక్క పోస్ట్ తో 24 మిలియన్లకు పైగా మనసులు గెలిచేస్తుంది అమ్మడు. సినిమాలు చేస్తున్నా చేయకపోయినా పూజా హెగ్డే మాత్రం తన ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ అప్డేట్స్ ఇస్తూ ఉంటుంది. ముఖ్యంగా తన ఫోటో షూట్స్ కి అయితే సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. సినిమాలకు కొద్దిగా గ్యాప్ దొరికింది అనిపిస్తే చాలు వరుస ఫోటో షూట్స్ తో సినిమాల కన్నా ఎక్కువ తన ఇన్ స్టా లోనే ఫాలోవర్స్ ని అలరిస్తుంది అమ్మడు. %ఌశ్రీంశీ =ఘఎ% – ఉస్తాద్ భగత్ సింగ్ లో ఒకప్పటి హీరోయిన్..! ఇదే క్రమంలో లేటెస్ట్ గా ఓ ట్రెండీ వేర్ తో క్రేజీ లుక్స్ తో కుర్రాళ్ల మనసును గాయం చేస్తుంది పూజా బేబీ. స్టైలిష్ డిజైనర్ జాకెట్ తో పూజా గ్లామర్ ట్రీట్ ఇస్తుంది. జాకెట్ కి అక్కడక్కడ చిన్న హోల్స్ ఆమె స్కిన్ టోన్ ని తెలియచేస్తున్నాయి. ఫోటో షూట్స్ లో పి.హెచ్.డి చేసినట్టుగా అనిపించే పూజా హెగ్డే లేటెస్ట్ ఫోటో షూట్ చూసిన వారు ఎవరైనా సరే మేడం సార్ మేడం అంతే అనక తప్పదు. వేసుకున్న కాస్ట్యూమ్ మాత్రమే కాదు తన చూపులతో కూడా షివరింగ్ తెప్పిస్తుంది పూజా హెగ్డే. %ఌశ్రీంశీ =ఘఎ% – రకుల్ అందాల మెరుపులు.. కొటేషన్ కూడా..! ఇక అమ్మడి సినిమాల విషయానికి వస్తే మహేష్ గుంటూరు కారం నుంచి ఎగ్జిట్ అయిన తర్వాత మరో సినిమా కన్ఫర్మ్ కాలేదు. చెప్పుకోవడానికి నాని వివేక్ ఆత్రేయ సినిమా.. రవితేజ నెక్స్ట్ సినిమా హీరోయిన్ అంటున్నారు కానీ వాటిలో ఏది అఫీషియల్ గా కన్ఫర్మ్ కాలేదు. తెలుగులో కొద్దిగా గ్యాప్ ఇచ్చిన పూజా హెగ్డే హీరోలో బిజీ అవ్వాలని చూస్తున్నా అక్కడ కూడా ఆశించిన అవకాశాలు లేవని తెలుస్తుంది. తెలుగులో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న పూజా హెగ్డే ప్రస్తుతం చేతిలో సినిమాలు లేకపోయినా సరే మళ్లీ ఇక్కడ తన ఫాం కొనసాగించాలని చూస్తుంది. సెట్స్ మీద ఉన్న స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్స్ ఆల్రెడీ ఫిక్స్ అయ్యారు కాబట్టి కొత్త సినిమాలు స్టార్ట్ అయితే అప్పుడు ఏమన్నా పూజా హెగ్డేకి ఛాన్స్ ఇచ్చే వీలుంటుంది. సినిమాలు ఉన్నా లేకపోయినా తన ఫాలోవర్స్ ని ఇన్ స్టా ఫోటో షూట్స్ తో ఎట్రాక్ట్ చేస్తూ హడావిడి చేస్తుంది పూజా. బాలీవుడ్, టాలీవుడ్ లోనే కాదు కోలీవుడ్ లో కూడా అవకాశం కోసం ఎదురుచూస్తున్న పూజా హెగ్డే అక్కడ ఒక ప్రాజెక్ట్ డిస్కషన్ స్టేజ్ లో ఉందని తెలుస్తుంది.

అలియాభట్ స్థానాన్ని జాన్వీకపూర్ భర్తీ చేస్తుందా?



అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కుమార్తె జాన్వీ కపూర్ జర్నీ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. తండ్రి బోనీ కపూర్ సూచనలు..సలహాలు పాటిస్తూ ప్రయాణం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ‘దేవర’తో ఎంట్రీ ఇస్తుంది. ఇందులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కి జోడీగా నటిస్తోంది. ఈసినిమా సెట్స్ లో ఉండగానే అమ్మడికి తెలుగు అవకాశాలు క్యూ కడుతున్నాయి. జాన్వీతో రొమాన్స్ తడుపరి ఏ హీరో తీసుకుంటాడు? అన్న గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. వాస్తవానికి ఈ రేసులో ఉండాల్సింది అలియాభట్. ‘ఆర్ ఆర్ ఆర్’ విజయం తర్వాత చరణ్..ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలు ఆమెకే ముందుగా వచ్చాయి. కానీ అలియా బాలీవుడ్ పై ఫోకస్ పెట్టే క్రమంలో ఆ ఛాన్స్ తీసుకోలేదు. సరిగ్గా ఇదే సమయంలో జాన్వీ లో ‘దేవర’ ఛాన్స్ అందుకోవడం తో సీన్ మొత్తం రివర్స్ అయింది. %ఌశ్రీంశీ =ఘఎ% – ఉస్తాద్ భగత్ సింగ్ లో ఒకప్పటి హీరోయిన్..! అలియాభట్ కి వస్తోన్న అవకాశాలు జాన్వీ అందుకుని ఆస్థానాన్ని భర్తీ చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికి సంబంధించి జాన్వీ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. వెనుక చాణుక్యుడు లాంటి తండ్రి బోనీ కపూర్ ఉన్నాడు. ఏ హీరోతో నటించాలి? ఎలాంటి కథకి సైన్ చేయాలి? ఎలాంటి బ్యానర్ లో చేయాలి? వంటి వాటిలో నిష్ణాతుడు. ఆయన సలహాలు తీసుకుంటూ జాన్వీ టాలీవుడ్ లో కూడా ముందుకెళ్తుంది. తెలుగులో కూడా ఆమెని పెద్ద హీరోయిన్ చేయాలన్నది కల. శ్రీదేవి టాలీవుడ్ లో ఎంత పేరు సంపాదిం చిందో కుమార్తె కూడా ఆమె లెగస్సీని అందుకోవాలని భర్తగా ఆశపడుతున్నారు. అందుకే జాన్వీ ప్రతీ నిర్ణయం వెనుక బోనీ కపూర్ ఉన్నారు. ఇప్పుడొచ్చిన అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలని తండ్రీ–కుమార్తెలిద్దరు సీరియస్ గా పని చేస్తున్నారు. మరి ‘దేవర’ జాన్వీకి ఎలాంటి విజయాన్ని అందిస్తుందో? ఎలాంటి మార్గాన్ని నిర్దేశిస్తుందో చూడాలి.